# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇస్నాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్ మరియు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు. హాల్ టికెట్లు అందాయా, అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు రివిజన్ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడం లేదని గమనించి, వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన కలెక్టర్ హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అదేవిధంగా కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పై ఎంఈఓ వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈఓకు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేసారు. శానిటేషన్ గ్రాంట్ కింద ఎంత మందిని ఎంగేజ్ చేసుకుంటున్నారో, వారి పేర్లు, ఎప్పటి వరకు పేమెంట్ చేశారన్న వివరాలను అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం , డైనింగ్ హాల్ సరిగా శుభ్రం చేయకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ ప్రాంతంలో ఉన్న లెగసీ వ్యర్థాలను 48 గంటల్లో పూర్తిగా తరలించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా ఒక కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలను సేకరించే మున్సిపల్ ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్తను ఎక్కడ ప్రాసెస్ చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై వెంటనే చర్యలు తీసుకొని యాక్షన్ టేకన్ రిపోర్ట్ ను సమర్పించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ సందర్భనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, చైర్మన్

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజల బాధ్యత



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందువల్ల ఆరోగ్య సమస్యలు రావని ప్రజలే బాధ్యత వహించాలని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరిట 99 రోజుల కార్యచరణ భాగంగా సోమవారం అచ్చంపేట పట్టణంలోని 14వ వార్డులో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళి మరియు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల్ల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో కృత్రిమ మెద (ఏఐ) కెమెరాలు

- వన్య ప్రాణుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం టైగర్ రిజర్వులోని వన్యప్రాణుల సంరక్షణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. అడవి ప్రాంతంలో మనిషి వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్ కెమెరాలను కృత్రిమ మెద (ఏఐ) స్మార్ట్ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ స్మార్ట్ కెమెరాల వల్ల వణ్య ప్రాణుల సంరక్షణ సమాచారం ఎప్పటికప్పుడు గుర్తించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తాయని తెలిపారు. రంగంలోకి దింపిన స్మార్ట్ కెమెరాలు నాలుగు కిలోమీటర్ల దూరం వరకు నిఘా ఉంచుతాయని రేంజ్ ఆఫీసర్ వీరేష్ తెలిపారు. నల్లమల ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ మరింత పటిష్ట పరిచేందుకు వీలు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## బాణాల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- పల్లె ప్రకృతి వనంలో చెట్లకు పాదులు తీస్తున్న సిబ్బంది



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం బాణాల గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో సర్పంచ్ మరియు గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందితో చెట్లకు పాదులు తీయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి జరగాలంటే అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు నిజమైన పేద ప్రజలకు అందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశ్యా నాయక్ మరియు పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉపాధ్యాయులైన వేళ



దంతాలపల్లి మండలం రేపని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి వేణుమాధవ్ రెడ్డి హాజరవడం జరిగింది. అధ్యక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎడ్ల ప్రవీణ్ రెడ్డి, నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే బాగా కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండగలరని ప్రధాన ఉపాధ్యాయులు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గా మనదీపు, హెచ్ఎం గ నస్రీన్ తదితరులు వ్యవహరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి అంటున్న స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ

- కారులకు తన వంతుగా ప్రోత్సాహం అందిస్తానని హామీ



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం నుండి బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించిన బాబు నాయక్ నల్లమల ప్రాంతానికి గర్వకారణం అని అచ్చంపేట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ బాబు నాయక్ ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల ప్రాంతానికి చెందిన క్రీడాకారులకు తనవంతుగా ప్రోత్సాహం ఎల్లవేళలా అందిస్తానని తెలిపారు. జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించిన బాబు నాయక్ కు అందరూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాపురం రాజేందర్, కాశన్న యాదవ్, రామనాథం, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోడె లక్ష్మయ్య మృతి పట్ల సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నివాళి



అశ్వారావుపేట : గత 40 ఏళ్లుగా ప్రజా ఉద్యమాలతో విడదీయలేని అనుబంధం కలిగిన సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సానుభూతిపరులు కోడె లక్ష్మయ్య మృతి పట్ల ఆ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఖమ్మంపాడు గ్రామం లో జరిగిన సంతాప సభలో ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, లక్ష్మయ్య గత నాలుగు దశాబ్దాలుగా పార్టీ ఆశయాలకు కట్టుబడి పనిచేశారని కొనియాడారు. ఈ ప్రాంతంలో జరిగిన అనేక భూ పోరాటాలలో, కూలీల హక్కుల కోసం సాగిన ఉద్యమాలలో ఆయన అగ్రభాగాన నిలిచి చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం స్థానిక ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు కంగాల వెంకటేష్, కుంజ వెంకట్రావు, కంగాల శంకర్, సోడెం ముత్యాలు, సోడెం కన్నారావులతో పాటు కోయరంగాపురం గ్రామ సర్పంచ్ సోడెం చిన్న గంగమ్మ మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎమ్మార్సీ సిబ్బందికి బేసిక్ పే ఇవ్వాలి

- టీఎస్ యుటిఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పి.రాజు




సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎమ్మార్సీలో పనిచేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్ వర్తింపజేస్తూ బేసిక్ పే ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పి.రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్సీ సిబ్బంది, భోజన విరామ సమయంలో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పి.రాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను పనిచేస్తున్న సిబ్బందిని సర్వీస్ లను రెగ్యులరైజ్ చేయాలని,సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వారికి హెల్త్ కార్డులను కూడా వర్తింపజేయాలని,ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.రాజు ఉపాధ్యాయులు రవి కిరణ్ ఎమ్మార్సీ సిబ్బంది ఎమ్మెస్ కోఆర్డినేటర్ సంధ్య డాటా ఎంట్రీ ఆపరేటర్ తిరుపతి మెసెంజర్ రమా తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ అధికారుల భయంతో అచ్చంపేటలో మూతపడ్డ దుకాణాలు




- విపరీతమైన ధరలను వేస్తూ మోసం చేస్తున్న వ్యాపారాలు

నాగర్ కర్నూలు జిల్లా తాలూకాలో వ్యాపారస్తులు జీఎస్టీతో చేస్తున్న మోసాలను అరికట్టడానికి అచ్చంపేట కు జీఎస్టీ అధికారులు రాగానే వెంటనే షాపులు బంద్ చేసి మూసి వేయడం జరిగింది. ప్రజలను మోసం చేస్తూ వ్యాపారస్తులు విపరీతమైన ధరలను వేస్తూ ప్రభుత్వానికి జీఎస్టీ కట్టాలి అని చెప్పి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నటువంటి వ్యాపారస్తులు ఆఫీసర్ రాగానే ఎందుకు పరిగెడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిక లాభాల కోసం వ్యాపారస్తులు వారి ఇష్టానుసారంగా ధరలు వేస్తున్నారని ఇప్పటికైనా అచ్చంపేట ప్రజానీకం ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖులు, మేధావులు సూచించారు. జివిస్టి పేరుతో ప్రజలను మోసం చేసే వారిని గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

